సాక్షి
ఒడిశా
గురువారం । 6 । ఫిబ్రవరి । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,91,982లు, బంగారం 8 గ్రాముల 300 మిల్లీగ్రాములు, వెండి 49 గ్రాముల 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



దివ్యాంగులకు ఆసరాగా..

రోటరీ క్లబ్ (బరంపురం), గెయిల్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో దివ్యాంగులు, బధిరులకు ఉచితంగా ఉపకరణాలను పంపిణీ చేశారు.

- 8లో



హెరిటేజ్ స్కూల్‌గా గుర్తించాలి

మహారాజా శ్రీకృష్ణచంద్ర గజపతి నారాయణ దేవ్ నిర్మించిన ఉన్నత విద్యాలయాన్ని హెరిటేజ్ స్కూల్‌గా ప్రకటించాలని డీఈఓ కోరారు.

- 8లో

న్యూస్‌రీల్

జీసీడీ వాకర్స్‌క్లబ్ నూతన కార్యవర్గం



అధ్యక్షుడు విజయ్‌మోహన్‌ను అభినందిస్తున్న క్లబ్ సభ్యులు

రాయగడ: స్థానిక జీసీడీ వాకర్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. బుధవారం జరిగిన ప్రత్యేక సమావేశంలో కార్యవర్గాన్ని క్లబ్ సీనియర్ సభ్యులు సునీల్ చంద్ర పండ, టంకాల జయరాం, సురేంద్ర ప్రసాద్ సాహు, న్యాయవాది మనోజ్ రథ్‌లు ప్రకటించారు. అధ్యక్షులుగా చిన్నారి విజయ మోహన్, కార్యదర్శిగా అజిత్ కుమార్ సుబుద్ధి, కోశాధికారిగా సుభాష్ చంద్ర బారిక్‌లను ఎన్నుకున్నారు. క్లబ్ తరఫున నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ ఏడాది రక్తదాన, వైద్య శిబిరాలను విస్తృతంగా నిర్వహించేందుకు సన్నహాలు చేస్తున్నామని నూతన అధ్యక్షుడు విజయ్ మోహన్ తెలిపారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు దుర్మరణం



మార్చురీ వద్ద సాహు మృతదేహం

రాయగడ: కొలనార సమితి కులబంధ మందిరం సమీపంలో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో హతిఖొంబ గ్రామానికి చెందిన భికారి సాహు(82) అనే వృద్ధుడు దుర్మరణం చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎదురెదురుగా రెండు బైకుల ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీజీవీవో పథకం ప్రారంభం



ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న కలెక్టర్ పట్వారి తదితరులు

రాయగడ: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి బుధవారం వర్చువల్ విధానంలో వికసిత్ గ్రామం, వికసిత్ ఒడిశా (వీజీవీవో) పథకాన్ని ప్రారంభించారు. స్థానిక సమితి కార్యాలయం సమావేశం హాల్‌లో ప్రత్యక్ష కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి, జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ లాల్ మోహన్ రౌత్రాయ్, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహక అధికారి అక్షయ కుమార్ ఖెముండి, సమితి చైర్మన్ టున్ని హుయిక, ఉపాధ్యక్షులు హర ప్రసాద్ హెప్రూక, సర్పంచులు, జిల్లా పరిషత్ సభ్యులు, సమితి సభ్యులు, సంబంధిత శాఖ అధికారులు వీక్షించారు. సుమారు ఐదు వేల కోట్ల రూపాయలతో ఐదేళ్లలో రాష్ట్రంలోని అన్ని గ్రామాలను వివిధ రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి వివరించారు. ప్రతీ జిల్లాలో కలెక్టర్ నేతృత్వంలో పథకం అమలు, అభివృద్ధి తీరు ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. ఈ నెల 14 వ తేదీ నుంచి ప్రారంభమవ్వనున్న ఈ పథకంలో భాగంగా 20 తేదీలోగా గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ఆయా గ్రామ సభల అనుమతిని సమితుల్లో దాఖలు చేయాల్సి ఉంటుందని అన్నారు. ఈ పథకం ద్వారా గ్రామాల రూపురేఖలు మారనున్నాయని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

1 టికెట్ ఫ్లీజ్!

- బారాబటి స్టేడియం వద్ద ఉద్రిక్తత
- వన్డే క్రికెట్ మ్యాచ్ టికెట్ల కోసం ఎగబడిన అభిమానులు
- అర్ధరాత్రి నుంచే క్యూలైన్‌లో పడిగాపులు
- తొక్కిసలాటను అదుపు చేసిన పోలీసులు



టికెట్ కౌంటర్ వద్ద గుమిగూడిన జనం



రద్దీ నియంత్రణలో పోలీసుల పాట్లు

భువనేశ్వర్:

కటక్ బారాబటి స్టేడియంలో ఈ నెల 9న జరగనున్న భారత్, ఇంగ్లాండ్ వన్డే క్రికెట్ మ్యాచ్ టికెట్ల కోసం అభిమానులు ఎగబడ్డారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి టికెట్ల విక్రయ ప్రాంగణంలో పెద్ద సంఖ్యలో చేరుకుని రాత్రంతా పడిగాపులు చేశారు. ఉదయం 9 గంటల నుంచి కౌంటర్‌లో విక్రయించే టిక్కెట్లు కోసం అర్ధరాత్రి నుంచి జనాలు చేరడంతో ఒకానొక సమయంలో తొక్కిసలాట పరిస్థితి చోటు చేసుకుంది.

4 కౌంటర్లు.. 12 వేల టికెట్లు

టిక్కెట్ల విక్రయానికి 4 కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఇందులో దాదాపు 12 వేల టికెట్లు విక్రయించారు. రద్దీ నియంత్రణ కోసం పోలీసులు రంగంలోకి దిగాల్సి వచ్చింది. ఆన్‌లైన్‌లో టికెట్లు దక్కించుకోలేని క్రికెట్ అభిమానులు వాటిని ఆఫ్‌లైన్‌లో కొనాలని ఎగబాకడంతో ఈ పరిస్థితి చోటు చేసుకుంది. స్పెషల్ ఎన్‌క్లోజర్, ఏసీ గ్యాలరీ, న్యూ పెవిలియన్, కార్పొరేట్ బాక్స్ టిక్కెట్ల గురప్రు గేట్ ప్రాంగణంలో టికెట్లు విక్రయించారు. మిగిలిన అన్ని గ్యాలరీ టికెట్లను కిల్లానా లేక్‌లోని 3 కౌంటర్లలో విక్రయానికి ఏర్పాట్లు చేశారు. తొలిసారిగా మహిళా ప్రేక్షకుల కోసం ప్రత్యేక కౌంటరు ఏర్పాటు చేశారు.

ప్రత్యేక బస్సులు..

బారాబటి స్టేడియంలో భారత్, ఇంగ్లాండ్ వన్డే మ్యాచ్ పురస్కరించుకుని కటక్ నగరంలో పలు ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ఎటువంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా స్టేడియం లోపల, వెలుపల గట్టి భద్రతా చర్యలు చేపడుతున్నారు. కటక్ నగర పాలక సంస్థ స్టేడియం పరిసరాల్లో సుందరీకరణ, పారిశుధ్యం, ఫాగింగ్ కార్యకలాపాలను చేపడుతోంది. ఈ మేరకు ఉన్నత స్థాయి సమావేశంలో మ్యాచ్ సన్నాహాలను సమీక్షించారు. కటక్ జిల్లా యంత్రాంగం, ఒడిశా క్రికెట్ అసోసియేషన్ (ఓసీఏ), ఒడిశా ఒలింపిక్ అసోసియేషన్, పోలీసు, ఆరోగ్య విభాగాలు, నగర పాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.



టికెట్ల కోసం ఎగబాకిన అభిమానులు



రద్దీ నియంత్రణలో పోలీసులు

మరో ఏనుగు మృత్యువాత



కటక్ జిల్లా నర్సింగపూర్‌లో మరో ఏనుగు మృతి చెందింది. చౌతారాపాద సెక్షన్ కంపార్ట్‌మెంట్- 4 ప్రాంతంలో దీనిని గుర్తించారు. దీని వయసు సుమారు ఐదేళ్లు ఉంటుందని భావిస్తున్నారు. మృతికి గల కారణాలపై అటవీ శాఖ ఆరా తీస్తోంది. కాగా, కొన్నాళ్లుగా ఏనుగులు మృత్యువాత పడుతున్న సంగతి తెలిసిందే.

–భువనేశ్వర్

జనావాసాల్లోకి సరుకు రవాణా రైలు



రౌర్కెలా ప్రాంతంలో పట్టాలు తప్పిన సరుకు రవాణా రైలు పరిసరాల్లో ఉన్న బసంతి కాలనీ పార్కింగ్ ప్రాంతంలోకి దూసుకుపోయింది. బుధవారం ఉదయం జరిగిన ఈ ఘటనలో మూడు వ్యాగన్లు పట్టాలు తప్పినా అదృష్టవశాత్తూ ఎవరికీ ప్రాణహాని జరగలేదు. రైల్వేశాఖ యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టింది. ఈ ఘటనకు గల కారణాన్ని తెలుసుకోవడానికి విచారణ ప్రారంభించింది.

– భువనేశ్వర్

ఉత్సాహంగా క్రికెట్ జట్ల ఎంపిక



ఎంపిక ప్రక్రియకు హాజరైన క్రీడాకారులు

జయపురం: జిల్లా క్రికెట్ జట్ల ఎంపికలు ఉత్సాహంగా జరిగాయి. త్వరలో జరుగనున్న కలహండి క్రికెట్ కప్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు కొరాపుట్ జిల్లా జట్ల ఎంపిక చేసేందుకు జయపురం సబ్ డివిజన్ అథ్లటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక విక్రమదేవ్ యూనివర్సిటీ క్రీడా మైదానంలో క్రికెట్ పోటీలను బుధవారం నిర్వహించారు. నాలుగు బృందాలుగా క్రీడాకారులను విభజించి పోటీలు చేపట్టారు. జయపురం సమితి బీడీవో శక్తి మహాపాత్రో ముఖ్యఅతిథిగా పోటీలను ప్రారంభించారు. ముందుగా ఆటగాళ్లను పరిచయం చేసుకొని కరచలనం చేశారు. అంపైర్లుగా అభిషేక్ పట్నాయక్, ఉమా, శక్తి బిశ్వాల్, సౌమ్యరంజన్ బెహర వ్యవహరించారు. తెల్లటి డ్రెస్సు టీమ్‌కు అభిషేక్ మహంతి, పసుపురంగు టీమ్‌కు ఆదిత్య రౌత్, నీలంరంగు టీమ్‌కు చిన్మయ పండ, బ్లూ రంగు టీమ్‌కు దిలీప్ కుమార్ స్పైన్ కెప్టెన్‌లుగా వ్యవహరిస్తున్నారు. జయపురం సబ్‌డివిజన్ అట్లథిక్ అసోసియేషన్ కార్యదర్శి రబి నాయిక్, క్రీడా మేనేజర్ వై.ప్రసాద్ పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న బీడీవో శక్తి మహాపాత్రో



ఆటగాళ్లను పరిచయం చేసుకుంటున్న అతిథులు

గ్రామీణ అభివృద్ధితోనే దేశాభివృద్ధి





వేదికపై సీఎం, ఇతర ప్రముఖులు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న సీఎం మోహన్‌చరణ్ మాఝి

- ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి
- వికసిత గ్రామం-వికసిత ఒడిశా ప్రారంభం

భువనేశ్వర్: గ్రామీణ అభివృద్ధితోనే దేశ సమగ్ర అభివృద్ధి ముడి పడి ఉందని ముఖ్యమంత్రి మోహన్ చరణ మాఝి అన్నారు. దీనిలో భాగంగా లక్ష్య సాధన కోసం ప్రభుత్వం వికసిత గ్రామం - వికసిత ఒడిశా కార్యక్రమం ప్రవేశ పెట్టిందన్నారు. ఖుర్దా జిల్లా జంకియా ప్రాంతంలో బుధవారం ఈ కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధి కోసం పట్టణ, నగర, గ్రామీణ ప్రాంతాల్లో వివిధ సేవలు, సౌకర్యాల మధ్య అంతరం నివారించేందుకు ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి లేకుండా దేశాభివృద్ధి అసాధ్యమని చెప్పారు. దేశ వ్యాప్తంగా గ్రామీణ మౌలిక సదుపాయాలు మెరుగుదల ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి వికసిత్ గ్రామం - వికసిత్ ఒడిశా కార్యక్రమం కొత్త ఊపునిస్తుందని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. 2036 నాటికి వికసిత్ ఒడిశా సంకల్ప సాధనకు కొత్త కార్యక్రమం గట్టి పునాదిని వేస్తుందన్నారు. ఇందుకు గాను రానున్న ఐదేళ్లలో ప్రభుత్వం ఐదు వేల కోట్ల రూపాయల వ్యయ ప్రణాళిక ఖరారు చేసినట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమం కింద గ్రామీణ ప్రాంతాల్లో విద్య, క్రీడలు, రవాణా, చిన్న తరహా పర్యాటక మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంతోపాటు సాంస్కృతిక కేంద్రాలు, కల్యాణ మండపాలు, కమ్యూనిటీ సెంటర్లు తదితర సౌకర్యాలు కల్పిస్తారు. ప్రజల భాగస్వామ్యం, ప్రభుత్వ సహకారం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరచడమే వికసిత గ్రామం - వికసిత ఒడిశా కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.



కార్యక్రమానికి హాజరైన ప్రజలు

నిరాటంకంగా సంక్షేమ పథకాలు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో ఫిబ్రవరి 15 నుంచి ఐదేళ్ల పాటు అన్ని పంచాయతీలలో మౌలిక సౌకర్యాల కల్పన, ఇతర సంక్షేమ పథకాలు నిరాటంకంగా అమలవుతాయని కలెక్టర్ బిజయకుమార్ దాస్ అన్నారు. వికసిత్ గావ్.. వికసిత్ ఒడిషా కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఖుర్దాలో ప్రారంభించగా గజపతి జిల్లా గుసాని సమితి మిషన్ శక్తి కేఫ్ వద్ద కలెక్టర్, ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహిలు పెద్ద తెరపై ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షులు గవర తిరుపతిరావు, డి.ఆర్.డి.ఎ. అధికారి గుణనిధి నాయక్, గుసాని సమితి అధ్యక్షులు ఎస్.వీర్రాజు, బి.డి.ఓ.గౌర చంద్ర పట్నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ వలలో భూగర్భజల ప్రాజెక్టు అధికారి

- రూ. కోటిన్నర నగదు సీజ్
- కొనసాగుతున్న దాడులు



జయపురం: సంతూన్ మహాపాత్రోను ప్రశ్నిస్తున్న విజిలెన్స్ అధికారులు

జయపురం/మల్కన్‌గిరి: విజిలెన్స్ అధికారుల వలలో భూగర్భజల (సోయిల్ కన్జర్వేషన్) విభాగ ప్రాజెక్టు డైరెక్టర్ సంతూన్ మహాపాత్రో చిక్కారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్టు వచ్చిన ఆరోపణలు నేపథ్యంలో సంతూన్ మహాపాత్రో ఇళ్లు, ఆస్తులపై బుధవారం ఉదయం నుంచి కొరాపుట్ విజిలెన్స్ డివిజన్, జయపురం అధికారులు దాడులు జరుపుతున్నారు. విజిలెన్స్ ఎస్పీ ప్రసన్న కుమార్ ద్వివేదీ ఆదేశం మేరకు విజిలెన్స్ డీఎస్పీ డీపీ పాణి నేతృత్వంలో 15 మంది విజిలెన్స్ సిబ్బంది మల్కనగిరిలో సోయిల్ కన్జర్వేషన్ ప్రాజెక్టు కార్యాలయం, జయపురం పవర్ హౌస్ కాలనీలో అతడి నివాస భవనంతోపాటు తొమ్మిది ప్రాంతాల్లో ఒకేసారి దాడులు కొనసాగించారు. సాయంత్రం వరకూ కోటిన్నర రూపాయలకు పైగా నగదు సీజ్ చేసినట్టు సమాచారం. అలాగే అధిక అక్రమ సంపద కనుగొన్నట్లు తెలిసింది. ఇంకా దాడులు కొనసాగుతున్నాయి. అలాగే మల్కన్‌గిరిలోని భూగర్భజల కార్యాలంలో పని చేస్తున్న సహాయ ఇంజినీర్ మోహన్ మండాల్, డెటా ఏంట్రీ ఆపరేటర్ విశ్వజీత్ మండాల్, కాంట్రాక్టబేస్ ఉద్యోగి అలియా కుమార్ సాహు ఇళ్లలో కూడా విజిలెన్స్ అధికారులు దాడులు చేసి తనిఖీలు చేశారు. అయితే సంతూన్ మహాపాత్రో ఇళ్లలోనే కోటిన్నర రూపాయల నగదు, 350 గ్రాముల బంగారాన్ని అధికారులు సీజ్ చేశారు. జయపురంలో మూడు అంతస్తుల ఇళ్లు, ఆరు వేల అడుగుల స్థలం, భువనేశ్వర్, జయపురంలో నాలుగు ఖరీదైన ఇళ్లు, భువనేశ్వర్ హంసపాల్‌లో 33 అడుగులు స్థలం ఉన్నట్టు గుర్తించారు. బ్యాంక్ పాస్‌బుక్‌లు, రెండు బైక్‌లు, ఓ కారును అధికారులు స్వాధీనం చేసుకున్నారు.



పట్టుబడిన నగదు



మల్కన్‌గిరి: జయపురంలోని సంతూన్ మహాపాత్రో ఇంట్లో దొరికిన బంగారు ఆభరణాలు



జయపురం పవర్ హౌస్ కాలనీలో మహాపాత్రోకు చెందిన భవనం

శంకరరావు అభినందనీయుడు



కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులు



స్వర్గరథం వద్ద శంకర రావు దంపతులు

జయపురం: కొట్‌పాడ్ ప్రాంతానికి స్వర్గరథం, శవపేటిక ఫ్రీజర్ అందజేసిన కొట్‌పాడ్ చాంబర్ ఉపాధ్యక్షుడు బి.శంకరరావు అభినందనీయుడని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. స్వర్గరథం, ఫ్రీజర్లను మంగళవారం ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేమాట్లాడుతూ కొట్‌పాడ్ ప్రాంత ప్రజలు మృతదేహాలను శ్మశానవాటికకు తరలించేందుకు స్వర్గరథం కోసం ఇన్నాళ్లా ఎదురు చూసారని, ఎట్టకేలకు వారి నిరీక్షణకు తెరపడిందన్నారు. అనంతరం శంకరరావు దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తివాసన్, జయపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు వి.ప్రభాకర్, డాక్టర్ రంజిత్, మాజీ మంత్రి పద్మిణీ దియాన్, జయపురం బీడీఓ శక్తి మహాపాత్రో, సమాజసేవి గణేష్ పండా, సుకాంత మిశ్ర, బాల్య నాయిక్, అజిత్ పాత్రో, స్వాధీన చంద్ర మహంతి, బపూన్ త్రిపాఠీ, కొట్‌పాడ్ బ్లాక్ మీడియా అసోసియేషన్ అధ్యక్షుడు రంజిత్‌కుమార్ పట్నాయిక్, సత్యసాయి సమితి సభ్యులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఆసరాగా..



కార్యక్రమానికి హాజరైన గెయిల్ సంస్థ, రోటరీ ఇంటర్‌నేషనల్ ప్రతినిధులు



కృత్రిమ అవయవాల కొలతలు తీస్తున్న ప్రతినిధులు



హాజరైన దివ్యాంగులు, కుటుంబ సభ్యులు



దివ్యాంగులకు త్రిచక్రవాహనాల పంపిణీ

- గెయిల్, రోటరీ ఇంటర్‌నేషనల్ ఆధ్వర్యంలో ఉచిత అవయవదాన శిబిరం
- తరలివచ్చిన లబ్ధిదారులు

పర్లాకిమిడి: ఉపకరణాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని వక్తలు పేర్కొన్నారు. దివ్యాంగులు, బధిరులకు వినికిడి పరికరాలు, త్రిచక్ర వాహనాలు, కాలిపర్స్ వంటి ఉపకరణాలను రోటరీ క్లబ్ (బరంపురం), గెయిల్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో పర్లాకిమిడి టౌను హాలులో బుధవారం ఉచితంగా పంపిణీ చేశారు. సాక్ష్యం-5 పేరిట జరిగిన ఈ శిబిరాన్ని జిల్లా సామాజిక సురక్షా అధికారి సంతోష్‌కుమార్ నాయక్ ప్రారంభించారు. రాజస్థాన్ భగవాన్ మహావీర్ వికలాంగ సహాయత్ సంస్థ ఆధ్వర్యంలో పలువురు దివ్యాంగులకు పరీక్షలు చేసి కృత్రిమ అవయవాలు అక్కడికక్కడే తయారుచేసి లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో సమర్థ దివ్యాంగుల సంస్థ అధ్యక్షులు సంతోష్ మహారాణా, గెయిల్ సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ మంగేష్ రాంటెక్, రోటరీ క్లబ్ ఇంటర్‌నేషనల్ (బరంపురం ఈస్టు) ప్రెసిడెంట్ జయంత్ కిషోర్ పాత్రో, కార్యదర్శి ఎస్.దుర్గారావు, చైర్మన్ అజిత్‌కుమార్ త్రిపాఠి, పూర్వపు ప్యాట్రన్స్ ఐ.రాజేశ్వరరావు, సంబిత్ బెగ్రే తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

న్యాయసేవలపై అవగాహన



మాట్లాడుతున్న సుమన్ జెనా

జయపురం : జయపురం సమితి గొడొపాదర్ పంచాయతీ చతుడిపుట్ గ్రామంలో బుధవారం కొరాపుట్ జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ సంస్థ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయ సేవా ప్రదీకరణ కార్యదర్శి, లోక్ అదాలత్ శాశ్వత విచారపతి సుమన్ జెనా మాట్లాడుతూ న్యాయసేవలను ఉచితంగా ఎలా పొందవచ్చో వివరించారు. సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. జయపురం ప్రభుత్వ కార్మిక అధికారి చైతన్యప్రసాద్ మరిఖి మాట్లాడతూ ప్రవాస కార్మిక సమస్యలను వివరించారు. పారా లీగల్ స్వయం సేవకురాలు మహాలక్ష్మీ పండా పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సమితి సురక్షా అధికారి కె.ఎస్.నిశా తదితరులు పాల్గొన్నారు.

రుచి, శుచికరమైన ఆహారం అందించాలి



హాస్పిటల్‌లో మిషన్ శక్తి కఫేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం: కొరాపుట్ జిల్లా కేంద్ర హాస్పిటల్‌లో మిషన్ శక్తి వారు కఫే (కేంటిన్) ఏర్పాటు చేయడం వలన రోగులు, వారికి సహాయంగా వచ్చేవారికి తక్కుక ధరలకు ఆహారం లభిస్తుందని జయపురం ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి వెల్లడించారు. రోగులకు శుచి, రుచికరమైన ఆహారం అందించాలన్నారు. కఫేలో పరిశుభ్రత పాటించాలన్నారు. కొరాపుట్ జిల్లా కేంద్రం హాస్పిటల్ జయపురం ప్రాంగణంలో మిషన్ శక్తి కఫేను బుధవారం ప్రారంభించారు. కల్యాణి మహా సంఘం మహిళలకు నిర్వహణ బాధ్యతలు అప్పజెప్పారు. మిషన్ శక్తి అధ్యక్షులు లక్ష్మీ నాయక్ మాట్లాడుతూ హాస్పిటల్‌లో రోగులకు, వారితో వచ్చే బంధువులకు కఫేలో తక్కువ ధరలకు టిఫిన్, మధ్యాహ్న, రాత్రి భోజనం లభిస్తుందని వెల్లడించారు. కఫే ప్రారంభోత్సవంలో డాక్టర్ దిలీప్ బిశ్వాల్, జయపురం సమితి బీడీఓ శక్తి మహాపాత్రో, జిల్లా పరిషత్ సభ్యులు తొపతి పట్నాయక్, రశ్మీ రథ్, హాస్పిటల్ మేనేజర్ రూపసీ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

బూర్జ: మండలంలోని కేకే రాజపురం గ్రామం వద్ద ఆటోకి త్రుటిలో ప్రమాదం తప్పింది. ఆటో శ్రీకాకుళం నుంచి పాలకొండ ప్రధాన రహదారిపై కేకే రాజపురం వెళ్తుండగా దట్టమైన పొగలు వచ్చాయి. అటువైపుగా వెళ్తున్న వారు చూసి డ్రైవర్‌ను అప్రమత్తం చేయడంతో వెంటనే ఆటో నిలిపివేశాడు. అనంతరం కొంత సమయం తర్వాత ఆటో నుంచి పొగ రావడం ఆగిపోయింది. అదృష్టవశాత్తు ఆటోలో ప్రయాణికులు లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

మరో రెండు డయాలసిస్ యూనిట్లు

కాశీబుగ్గ: పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌కు మరో రెండు డయాలసిస్ యూనిట్లను ఆంధ్ర మెడికల్ కాలేజీ అలుమ్ని ఆఫ్ నార్త్ అమెరికా మంజూరు చేసినట్లు స్పష్టం బుధవారం చేసింది. ఆంధ్ర మెడికల్ కాలేజీకి చెందిన ఎన్ఆర్ఐ వైద్యులు డయాలసిస్ యూనిట్లు అందించాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష గతంలో రాసిన లేఖకు వారు స్పందించారు. ఈ మేరకు కిడ్నీ రీసెర్చ్ కేంద్రానికి సుమారు రూ.15 లక్షల వ్యయంతో రెండు డయాలసిస్ యూనిట్లను అందించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. ఈ నెలాఖరుకు డయాలసిస్ యూనిట్లను అమర్చనున్నట్లు తెలిపారు.

థర్మల్ ప్లాంట్ ప్రతిపాదనలు విరమించుకోవాలి

- ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఉపాధ్యక్షుడు వాబ యోగి

సరుబుజ్జిలి: సరుబుజ్జిలి, బూర్జ మండలాల పరిసర గ్రామాల్లో థర్మల్ ప్లాంట్ నిర్మాణ ప్రతిపాదనలు విరమించుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఉపాధ్యక్షుడు వాబ యోగి కోరారు. ఈ మేరకు మండలంలోని వెన్నెలవలసలో ఆదివాసీలు, పరిసర ప్రాంత రైతులతో సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. థర్మల్ ప్లాంట్ నిర్మించి ఆదివాసీల బతుకులు బొగ్గుపాలు చేయవద్దన్నారు. థర్మల్ ప్లాంట్ నిర్మాణం మానవాళి వినాశనానికి కారణమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివలన నేల, నీరు, గాలి కలుషితమవుతాయని పేర్కొన్నారు. వంశధార రిజర్వాయర్‌లో ఉన్న నీటిని ప్లాంట్‌కు తరలిస్తే వేలాది ఎకరాల పంట భూములు బీడు భూములుగా మారుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. పవర్ ప్లాంట్ వ్యతిరేక ఉద్యమానికి జిల్లాలోని మేధావులు మద్దతుగా నిలవాలని కోరారు. అనంతరం ప్లాంట్ వ్యతిరేక పోరాట కరపత్రాలు విడుదల చేశారు. సమావేశంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ సరుబుజ్జిలి, బూర్జ మండల శాఖ అధ్యక్షుడు సురేష్ దొర, రైతుకూలీ సంఘం కార్యదర్శి వంకల మాధవరావు, డీటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు కోత ధర్మారావు, అత్తులూరి రవికాంత్, సింహాచలం, సవర ధర్మారావు, కృష్ణారావు పాల్గొన్నారు.

రాయగడలో స్టడీ కమిటీ పర్యటన



సమావేశంలో పాల్గొన్న స్టడీ కమిటీ సభ్యులు

రాయగడ: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేస్తున్న స్టడీ కమిటీ-8 రాయగడలో బుధవారం పర్యటించింది. ఎంఎల్ఏ మనోహర్ రంధా నేతృత్వంలో దాశరధి గొమాంగో, రుపు భత్ర, రఘురాం మచ్చ తదితరులు సభ్యులుగా ఉన్నారు. జిల్లాలోని కైలాస్‌పూర్ ఉన్నత పాఠశాల, కొలనారలో గల ఆశ్రమ పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఆయా పాఠశాలల్లో పరిశుభ్రత, విద్యా విధానం, ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనం, వసతి, తదితర సౌకర్యాలకు సంబంధించి నిర్వాహకులతో ప్రత్యేకంగా సమీక్షించారు. అనంతరం కొలనార సమితిలో గల స్వయం సహాయక బృందాలకు చెందిన మహిళలతో మాట్లాడారు. స్వయం ఉపాధికి చేపడుతున్న చర్యలు, ప్రభుత్వం మంజూరు చేస్తున్న సంక్షేమ పథకాలు వంటి వాటిపై ఆరా తీశారు. మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మూలుగుతున్న నిధులు..

అనంతరం స్థానిక డీఆర్‌డీఏ సమావేశం హాల్‌లో జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారీ, ఏడీఎం నిహారి రంజన్ తదితర అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో ఎంపీ, ఎమ్మెల్యే నిధులు మూలుగుతున్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజా హిత కార్యక్రమాలకు మంజూరైన నిధులు సక్రమంగా సద్వినియోగపరచకపోతే అభివృద్ధి ఎలా సాధ్యపడుతుందన్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రి జనజాతి జీవికా మిషన్, ముఖ్యమంత్రి స్వతంత్ర సహాయ పథకం, క్రిటికల్ గేప్ ఫండ్, మినరల్ ఫండ్, ప్రధానమంత్రి జన్‌మన్ యోజన తదితర పథకాల అమలు తీరుపై సమీక్షించిన స్టడీ కమిటీ సభ్యులు ఆయా పథకాల వినియోగంపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి మూలుగుతున్న నిధులు, వివిధ సంక్షేమ పథకాలు సక్రమంగా సద్వినియోగపరచాలని సూచించారు.

చర్చి ప్లాటినమ్ వేడుకలు రద్దుచేయాలి



కలెక్టరేట్ వద్ద బైఠాయించిన వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహానా బ్లాక్ లుహాగుడి గ్రామ పంచాయతీ దంతరీనల్లా చర్చి వద్ద ఈ నెల 14 నుంచి 17 వరకు జరుగనున్న ఎస్.బి.సి.ఎం.ఎస్ 75 వార్షిక ప్లాటినమ్ వేడుకలకు అధికారులు అనుమతి రద్దు చేయాలని కోరుతూ గజపతి జిల్లా హిందూ సురక్షా మంచ్ ఆధ్వర్యంలో రాజవీధి నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో ఆర్.ఎస్.ఎస్ జిల్లా సంఘ చాలక్ రాధాకృష్ణ జన్ని, మహేంద్రగిరి భాస్కరతీర్థ లక్ష్మీబాబా, రాష్ట్ర స్థాయి భజరంగ్ దళ్ అధ్యక్షుడు రాజీవ్‌లోచన్ ఖడంగ, వీహెచ్‌పీ (బుగుడ) ప్రతినిధి సత్యనారాయణ మహారాజ్, ప్రాంతీయ ఆర్.ఎస్.ఎస్ పర్యవేక్షకులు అనాది పాణిగ్రాహి, తదితరులు పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం కలెక్టరేట్ బైఠాయించారు. ఈ సందర్భంగా మహేంద్రగిరి భాస్కరతీర్థ విలేకర్లతో మాట్లాడుతూ, మోహానా బ్లాక్‌లో మతమార్పిడిలు జరుగుతున్నాయన్నారు. ఈ నెల 14 నుంచి క్రిస్టియన్ మహాసభలు నిర్వహించనున్నారని, దాని కోసం విదేశాల నుంచి క్రిస్టియన్ బాప్టిస్టులు ఐదు లక్షల మంది ఈ మహాసభలకు హాజరు అవుతున్నారన్నారు. ఈ సభల్లో విందుకు 40 గోవులను బలిచేసి గోమాంసం పెట్టనున్నారని, దీనిని అధికార యంత్రాంగం అడ్డుకోవాలన్నారు. ఏడీఎం రాజేంద్రమింజ్‌కు వీహెచ్‌పీ మాజీ అధ్యక్షుడు పూర్ణచంద్ర మహాపాత్రో, గజపతి సురక్షా మంచ్ నాయకులు రాజీవ్‌లోచన్ ఖడంగ వినతిపత్రాన్ని అందజేశారు. వీహెచ్‌పీ. జిల్లా కోశాధికారి హరిమోహన్ పట్నాయక్, మనోజ్ దాస్, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

హెరిటేజ్ స్కూల్‌గా గుర్తించాలి



జిల్లా స్థాయి పోటీలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థికి బహుమతి అందిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: మహారాజా శ్రీకృష్ణచంద్ర గజపతి నారాయణ దేవ్ 159 ఏళ్ల క్రితం నిర్మించిన ఉన్నత విద్యాలయాన్ని రాష్ట్ర ప్రభుత్వం హెరిటేజ్ స్కూల్‌గా ప్రకటించాలని డీఈఓ మాయాధర్ సాహు కోరారు. స్థానిక మహారాజా బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం వార్షిక పురస్కార వితరణ ఉత్సవంలో ఎమ్మెల్యే రూపేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పాఠశాల పైకప్పుకు మరమ్మతులు చేయించాలని, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రితో మాట్లాడి నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు గౌరచంద్ర పండా, మాజీ చైర్మన్ (పురపాలక) నృసింహ చరణ్ పట్నాయక్, హెచ్ఎం మోనాలిసా దాస్, ఉపాధ్యాయులు డి.శ్రీరామ్మూర్తి, జగన్నాథ పట్నాయిక్ పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధులకు నివాళులు



మధుసూదన దాస్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న త్రిపాఠీ



రాధాకృష్ణ బిశ్వాసరాయ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పూజ్య పూజ సంసద్ సభ్యులు

జయపురం: ప్రముఖ స్వాతంత్య్ర సమర యోధుడు, కొరాపుట్ గాంధీ స్వర్గీయ రాధాకృష్ణ బిశ్వాసరాయ్, ఉత్కళ గౌరవ్ మధుసూదన దాస్‌లకు మంగళవారం జయపురం పూజ్య పూజ సంసద్ ప్రతినిధులు నివాళులర్పించారు. వీరి వర్ధంతి సందర్భంగా స్థానిక రథోపాడియ వద్దగల మధుసూదన్ దాస్ ప్రతిమకు, జయపురం రెండో దైనిక బజారు కూడలి వద్ద గల స్వర్గీయ రాధాకృష్ణ బిశ్వాసరాయ్ ప్రతిమకు పూల మాలలు వేసి పూజ్య పూజ సంసద్ సభ్యులు నివాళులర్పించి వారి త్యాగాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పూజ్య పూజ సంసద్ ఉపాధ్యక్షులు తపన కిరణ్ త్రిపాఠీ, కార్యదర్శి బైరాగి సాహు, జయపురం సబ్‌డివిజన్ రక్తదాతల మోటివేటెడ్ అసోసియేషన్ కార్యదర్శి ప్రమోద్ కుమార్‌రౌళో పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపుకార్డులు



కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న అధికారులు



మహిళకు సహాయ నిధి చెక్ అందజేస్తున్న దృశ్యం



సభకు హాజరైన గిరిజనులు

మల్కన్‌గిరి : జిల్లాలోని మత్తిలి సమితి కేంద్రంలో బుధవారం భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేశారు. ఒడిశా గృహ నిర్మాణ, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ఆధ్వర్యంలో మల్కన్‌గిరి జిల్లా పరిపాలన, ప్రాంతీయ కార్మిక కమిషనర్ కార్యాలయం సహకారంతో సహిద్ లక్ష్మణ్ నాయక్ భవన్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. 138 మంది భవన నిర్మాణ కార్మికులకు రూ.63,79,200 ఆర్థిక సాయం కూడా అందజేశారు. కార్యక్రమంలో చిత్రకొండ ఎమ్మెల్యే మంగుఖీలో, సమితి అధ్యక్షుడు మహేష్ బక్క, జిల్లా పరిషత్ జోన్-1 అధ్యక్షురాలు లక్ష్మీ ప్రియనాయిక్ , జోన్-2 సభ్యురాలు సస్మితా మారిఖి, ఎంపీ ప్రతినిధి సంతోషిని పాత్రో, మత్తిలి ఐఐసీ దేవదత్త మల్లిక్, సమితి సభ్యుడు బాల్‌రాజ్ కోపే, సామాజిక కార్యకర్త స్మృతి రంజాన్ పా తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న, పత్తి కొనుగోలు చేయాలి



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న కిసాన్ మోర్చా నాయకులు

పర్లాకిమిడి: సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద వామపక్షాలు మొక్కజొన్న, పత్తి పంటకు మద్దతు ధర ప్రకటించాలని, మండీలు ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం ఆందోళన జరిపారు. గజపతి జిల్లాలో మూడు బ్లాక్‌ల్లో పండుతున్న మొక్కజొన్న, పత్తి పంటకు మద్దతుధర, మండీలు లేక పక్క రాష్ట్రాలకు అతి తక్కువ ధరకు పంటను అమ్ముకుంటున్నారని కిసాన్ మోర్చా అధ్యక్షుడు దండపాణి రైయితో ఆరోపించారు. ఆల్ ఇండియా కిసాన్ మోర్చా కార్యదర్శి జోన్న సుభాష్ చంద్రరావు, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా అధ్యక్షుడు పైల మురళీకృష్ణ, సి.పి.ఎం.ఎల్ (లిబరేషన్) అధ్యక్షుడు శ్రీనివాస బెహరా, రైతు సంఘం రైతు కూలీ నాయకుడు రొక్కం లోకనాథం, తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

సజావుగా రబీ పంటల ఈ-క్రాప్

నరసన్నపేట/జలుమూరు: జిల్లా వ్యాప్తంగా రబీ పంటల ఈ-క్రాప్ సజావుగా సాగుతోందని జిల్లా వ్యవసాయాధికారి కె.త్రినాథస్వామి అన్నారు. మడపాంలో ఈ-క్రాప్ నమోదుపై కొన్ని సర్వే నంబర్లను ఎంపిక చేసుకొని బుధవారం సాయంత్రం సూపర్ చెక్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ 1,27,119 ఎకరాల్లో రబీ పంటలు రైతులు వేస్తే ఈ క్రాప్ బుకింగ్ 1,07,936 ఎకరాల్లో పూర్తి చేసినట్లు వివరించారు. ఈ ప్రక్రియ ఎలా జరిగిందనే దానిపై సూపర్ చెక్ చేస్తున్నామని తెలిపారు. అనంతరం పాగోడు పంచాయతీ వెలుసోదలో తనిఖీ చేశారు. ఏడీఏలు రవీంద్రభారతి, భవానీ శంకర్, వ్యవసాయాధికారులు కె.సురేష్ కుమార్ పాల్గొన్నారు.

అవినీతి వెలికితీయాలి

- జాతీయ చేనేత సలహా సంఘం మాజీ సభ్యుడు మంచు కృష్ణారావు



మాట్లాడుతున్న మంచు కృష్ణారావు

శ్రీకాకుళం అర్బన్: పాతపట్నం మండలం కొరసవాడలో 1973లో స్థాపించిన ఉమాశంకర చేనేత సహకార సంఘంలో జరుగుతున్న అవినీతిని వెలికితీయాలని జాతీయ చేనేత సలహా సంఘం మాజీ సభ్యుడు మంచు కృష్ణారావు కోరారు. ఈ మేరకు శ్రీకాకుళంలోని ఎన్జీవో హోమ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొరసవాడ ఉమాశంకర చేనేత సహకార సంఘంలో గత 50 ఏళ్లుగా అవినీతి జరుగుతోందని విమర్శించారు. సంఘానికి అధ్యక్షత వహిస్తున్న మంచు చంద్రయ్య తన స్వలాభానికి సంఘం నిధులను కాజేసి, పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కార్మికులకు అందిస్తున్న సంక్షేమ పథకాలు కార్మికులకు అందకుండా అడ్డుపడుతున్నాడన్నారు. 2023-24 చివరి ఆడిట్‌లో 370 మంది చేనేత సంఘం సభ్యులు ఉన్నట్లు జాబితాలో చేర్చారని తెలిపారు. కానీ ప్రభుత్వం నియమించిన పీఐసీకి మాత్రం 132 మంది మాత్రమే ఉన్నట్లు జాబితా అందజేశారన్నారు. వీరిలో కూడా 28 మంది మాత్రమే మగ్గం కలిగిన చేనేత కార్మికులు ఉన్నారని వివరించారు. తక్షణమే జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కొరసవాడ ఉమాశంకర్ సొసైటీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో చేనేత సంఘ ప్రతినిధులు జనగ అప్పారావు, గణపతి రాజా రావునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రథసప్తమి ఆదాయం రూ.70.39 లక్షలు

అరసవల్లి: రాష్ట్ర పండుగగా తొలిసారి నిర్వహించిన మూడు రోజుల రథసప్తమి మహోత్సవంలో దర్శన టికెట్ల ఆదాయం ఫర్వాలేదనిపించినా.. ప్రసాదాల ఆదాయానికి మాత్రం పెద్ద గండే పడింది. రథసప్తమి ఒక్కరోజున మొత్తంగా దర్శన టికెట్లు, ప్రసాదాలు ద్వారా రూ.70,39,308 లభించిందని ఆలయ ఈవో వై.భద్రాజీ బుధవారం ప్రకటించారు. గత ఏడాది రూ.50,90,530 ఆదాయం రావడంతో ఈ ఏడాది రూ.20 లక్షలు అధికంగా సమకూరిందని చెప్పారు. రూ.100 దర్శన టికెట్ల ద్వారా రూ. 17,72,000, క్షీరాభిషేకం టికెట్లు(రూ.500) ద్వారా రూ. 14,97,000, విశిష్ట దర్శనం టికెట్లు (రూ.300) ద్వారా రూ.32,07,600, కేశఖండన శాల టికెట్ల (రూ.40) ద్వారా రూ.44,000, లడ్డూ ప్రసాదాల (రూ.15) ద్వారా రూ. 2,76,375, పులిహోర ప్రసాదం (రూ.10) ద్వారా రూ.2,25,400, విరాళాల ద్వారా రూ.16,933 వరకు ఆదాయం లభించినట్లు ప్రకటించారు. రథసప్తమి మహోత్సవం నిర్వహణకు సహకరించిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

'వీధి'కెక్కిన ప్రసాద విక్రయాలు..

ఉత్సవ నిర్వహణలో భాగంగా అమలు చేసిన పలు నిర్ణయాలతో కొంతమంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. అంతరాలయంలో క్షీరాభిషేకం అనంతరం తీర్థం, శఠగోపం తీసుకునే అవకాశాలు లేకుండా చేసిన పోలీసు, రెవెన్యూ అధికారుల తీరును భక్తులు బాహాటంగానే విమర్శించారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన దాతలకు పాసుల కుదింపుతో పాటు నేరుగా దర్శనానికి అవకాశమివ్వకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. మరోవైపు స్వామి వారి ప్రసాదాల విక్రయాలపై తీసుకున్న నిర్ణయాలపై ఉన్నతాధికారుల తీరుపై అటు భక్తులతో పాటు ఆలయ వర్గాలు కూడా తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల తయారితో పాటు భక్తులకు ఆలయ పరిసరాల్లో విక్రయిస్తే..దాన్ని మాత్రమే స్వామి వారి ప్రసాదంగా స్వీకరిస్తారు. అలాంటిది రిక్షా బళ్లపై తీసుకెళ్లి మెయిన్ రోడ్డులో పెట్రోల్ బంక్ వద్ద ప్రసాదం అమ్మే పరిస్థితి తెచ్చారు. ఆలయ చరిత్రలో తొలిసారిగా ప్రసాదాల విక్రయాలు ఇలా వీధికెక్కాయి. పోలీసు, రెవెన్యూ అధికారుల తప్పుడు నిర్ణయాలతో స్వామి వారి ప్రసాదాలను భక్తులు దర్శనానంతరం బయటకు వచ్చే మార్గంలో కాకుండా ఎక్కడో అర కిలోమీటర్ దూరంలో శ్రీకాకుళం రోడ్డులో అమ్మాల్సి వచ్చింది. దీనిపై ఆలయ ఈవో సైతం అభ్యంతరాన్ని తెలియజేసినా పోలీసుల అతి కారణంగా ఏమీ చెయ్యలేకపోయారని తెలిసింది. దీంతో లడ్డూ ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2,76,375, పులిహోర ద్వారా రూ.2,25,400 మాత్రమే ఆదాయం లభించింది. మొత్తంగా రూ.5,01,775 మాత్రమే ఆదాయం రాగా...గతేడాది ఈ రెండు ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.14,12,580 వరకు ఆదాయం లభించింది. ఫలితంగా ఈ ఏడాది దాదాపు రూ.10 లక్షల వరకు ఆదాయానికి గండి పడినట్లయ్యింది.

12న మహా కుంభమేళా ప్రత్యేక బస్సు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ అధికారులు

శ్రీకాకుళం అర్బన్: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాకు శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఈ నెల 12వ తేదీన ప్రత్యేక బస్సు బయలుదేరనుందని ఒకటి, రెండు డిపోల మేనేజర్లు హనుమంతు అమరసింహుడు, కేఆర్ఎస్ శర్మ తెలిపారు. ఈ మేరకు బుధవారం కాంప్లెక్స్ ఆవరణలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12వ తేదీ రాత్రి 8 గంటలకు శ్రీకాకుళం బస్ స్టేషన్ నుంచి బస్సు బయలుదేరనుందని తెలిపారు. మధ్యాహ్నం భోజనం, ఉదయం, రాత్రి అల్పాహారం అందిస్తామని చెప్పారు. ప్రస్తుతానికి 20 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. పూర్తిగా బస్సు బుక్ చేసుకున్నవారి ఇంటి వద్దకే బస్సు పంపిస్తామన్నారు.

ఒకరికి టికెట్ ధరను సూపర్ లగ్జరీకి రూ.9,500గా నిర్ణయించినట్లు తెలిపారు.పూర్తి వివరాలకు 9959225609, 7382917289, 7382921647, 7382921810 నంబర్లను సంప్రదించాలని కోరారు. అలాగే మరొక కొత్త సూపర్ లగ్జరీ (2+2 పుష్ బ్యాక్) బస్సును 7 రోజులు- 7 క్షేత్రాలను దర్శింప చేసేలా సిద్ధం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం

• జోనల్ అధ్యక్షుడిగా మెంటాడ స్వరూప్



వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో మెంటాడ స్వరూప్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ అధ్యక్షుడిగా మెంటాడ స్వరూప్ నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శ్రీకాకుళం నియోజకవర్గానికి చెందిన స్వరూప్‌ను నియమిస్తూ పార్టీ కార్యాలయం బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. అంకితభావంతో అలుపెరగకుండా కష్టపడి పనిచేస్తున్న స్వరూప్‌కు పార్టీలో మంచి అవకాశం లభించింది. ఇప్పటికే జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా అందరి మన్ననలు పొందారు. స్వరూప్ పనితీరును గుర్తించిన పార్టీ అధినేత తాజాగా యువజన విభాగం జోనల్ అధ్యక్షుడిగా నియమించారు. ఈ క్రమంలో విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామ రాజు, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల యువజన విభాగానికి అధ్యక్షుడిగా కొనసాగనున్నారు.

8న నవోదయ ప్రవేశ పరీక్ష

శృంగవరపుకోట: జవహర్ నవోదయ విద్యాలయలో ప్రవేశ పరీక్షను ఈనెల 8వ తేదీ శనివారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కిల్తంపాలెం జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ వి.దుర్గాప్రసాద్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యాసంవత్సరానికి గాను 9, 11 తరగతుల్లో ఉన్న ఖాళీలు భర్తీ చేసేందుకు నిర్వహిస్తున్న ఎల్‌ఈఎస్‌టీ–2025 పరీక్షను ఐదు కేంద్రాల్లో నిర్వహిస్తామన్నారు. 9వ గతరగతి అభ్యర్థులకు ఎస్.కోట మండల కేంద్రంలో నాలుగు పరీక్షా కేంద్రాల్లోను, 11వ తరగతి అభ్యర్థులకు నవోదయ విద్యాలయంలో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. 9వ తరగతిలో ప్రవేశానికి 1021 మంది, 11వ తరగతిలో ప్రవేశానికి 565 మంది దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ రిజిస్ట్రేషన్ నంబర్, పుట్టిన తేదీ ఉపయోగించి వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్స్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. అభ్యర్థులు ఒక గంట ముందు పరీక్షా కేంద్రానికి హాజరు కావాలని, మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ల 92474 69929, 80990 90562ను సంప్రదించాలని పేర్కొన్నారు.

మద్యం దుకాణాల దరఖాస్తుకు గడువు పెంపు

పార్వతీపురంటౌన్/వీరఘట్టం: మద్యం దుకాణాల దరఖాస్తులు స్వీకరణకు గడువు పెంచి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు పార్వతీపురం మన్యం జిల్లా ఇన్‌చార్జ్ ఈఎస్ శ్రీనాథుడు తెలి పారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 3 రిజర్వ్‌డ్ షాపులకు సంబంధించి గీత కులాలకు 50 శాతం లైసెన్స్ ఫీజు రాయితీతో కేటాయించిన మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 5 నుంచి 8 వరకు పొడిగించినట్లు తెలిపారు. లాటరీ తేదీని ఈ నెల 7 నుంచి 10 వరకు మార్చినట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒక్కో షాపు కోసం 50 నుంచి 60 దరఖాస్తులు ఇప్పటివరకు వచ్చినట్లు జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ శ్రీనాథుడు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం



చికిత్సపొందుతున్న పార్వతి

బాడంగి: తనతో పాటు పొలంపనికి రమ్మని పిలిచినా రాలేదని ఇంటికి తిరిగివచ్చిన భర్త కోపగించుకోవడంతో మనస్తాపానికి గురైన భార్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మండలంలోని గజరాయుని వలస గ్రామానికి చెందిన వర్రి అప్పన భార్య పార్వతి(39)గడ్డిమందుతాగి బుధవారం ఆత్మహత్యాయత్నం చేసింది. భర్త మందలించాడని మనస్తాపానికి గురై ఇంటిలో ఉన్న గడ్డిమందు తాగి అస్వస్థతకు గురికాగా భర్త, బంధువులు ఆటోలో స్థానిక సీహెచ్‌సీకి తరలించగా అక్కడి వైద్యురాలు సీహెచ్.హారిక ప్రథమ చికిత్సచేసి పరిశీలనలో ఉంచారు. అవసరమైతే విజయనగరం ఆస్పత్రికి రిఫర్ చేస్తామన్నారు. ఆస్పత్రి వారు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు జీడీలో నమోదు చేసుకున్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

దత్తిరాజేరు: మండలంలోని కె.కృష్ణాపురం గ్రామ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతిచెందినట్లు విజయనగరం రైల్వే ఎస్సై బాలాజీరావు, కానిస్టేబుల్ ఈశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం వారు మాట్లాడుతూ మృతుడిని గుర్తు పట్టేందుకు ఎలాంటి ఆధారాలు లేవని, పట్టాలు దాటుతుండగా లేదా, రైలు నుంచి జారి పడి మృతి చెంది ఉంటాడన్నారు. మృతదేహాన్ని విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించామని ఆచూకీ తెలిసిన వారు.రైల్వే ఎస్సై బాలాజీరావు ఫోన్ 94906 17089, బొబ్బిలి జౌట్‌పోస్ట్ ఇన్‌చార్జ్ ఈశ్వరరావు ఫోన్ 9491813163 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

పారాది ముందుకు కదలదా?

• బ్రిడ్జి పనులపై నీలినీడలు
• ఫౌండేషన్ పనులు పూర్తి
• కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సిన బిల్లుల పెండింగ్
• వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే అనుమతులు, నిధుల మంజూరు
• పట్టించుకోని ప్రస్తుత కూటమి ప్రభుత్వం



పారాది గ్రామం వద్ద వేగావతి నదిలో జరుగుతున్న బ్రిడ్జి పిల్లర్ల పనులు



మరమ్మతుల బారిన పడిన పాత బ్రిడ్జి

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది గ్రామం వద్ద వేగావతి నదిపై నిర్మిస్తున్న పారాది బ్రిడ్జిపనులపై నీలినీడలు అలుముకుంటున్నాయి. అంతర్రాష్ట్ర రవాణాలో వాహనాల రాకపోకలకు ప్రధానమైన పారాది బ్రిడ్జి పనులు శరవేగంగా జరుగుతున్నా నిర్దేశిత లక్ష్యం ఈ ఏడాది సెప్టెంబరు నాటికి పూర్తయ్యే అవకాశాలు కానరావడం లేదు. దశాబ్దాలుగా ప్రయాణికులను పట్టిపీడిస్తున్న పారాది గ్రామం వద్ద ఉన్న బ్రిడ్జి సమస్యను గుర్తించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, అప్పటి బొబ్బిలి శాసనసభ్యుడు శంబంగి వెంకటచినప్పలనాయుడు పట్టుదల, కృషితో కొత్త బ్రిడ్జి నిర్మాణానికి అడుగులు పడ్డాయి., ప్రజల అవస్థలు, ప్రతిపాదనలను గుర్తించిన గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం పారాది వద్ద కొత్త బ్రిడ్జి నిర్మాణానికి 2018లో యుద్ధప్రాతిపదికన ఎమ్మెల్యే ప్రతిపాదనను ఆమోదించి రూ.పది కోట్ల నిధులు మంజూరు చేసి విడుదల చేసింది. ఈ నిధులు మంజూరైన వెంటనే శంకుస్థాపన జరిగింది. ఇంతలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పనులు ప్రారంభంలోనే నిలిచిపోయాయి. ఎన్నికల అనంతరం కొత్త కూటమి ప్రభుత్వంలో మళ్లీ బ్రిడ్జి నిర్మాణం అంశం తెరపైకి రాగా ప్రభుత్వం అదనంగా మరో రూ.3.40 కోట్లు జీఎస్టీ నిధులను జమచేసింది. దీంతో మార్గం సుగమం అవుతూ గతేడాది సెప్టెంబరు నెలలో మరోసారి స్థానిక ఎమ్మెల్యే బేబీనాయన బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ పనులను ప్రారంభించారు.

కీలకమైన బ్రిడ్జి

విశాఖ నుంచి ఒడిశాలోని రాయగడ తదితర అంతర్రాష్ట్ర ప్రయాణాలకు ఈ పారాది బ్రిడ్జి ఎంతో కీలకం. సాధారణ వాహనాల రాకపోకలతో పాటు ఒడిశాలోని పరిశ్రమలకు ముడిసరుకుల చేరవేతకు ఈ బ్రిడ్జిపై నుంచే రాకపోకలు సాగాల్సి ఉంది. బొబ్బిలి పట్టణంలోని గ్రోత్ సెంటర్‌లోని పరిశ్రమలకు కూడా ముడిసరుకులను చేర్చేందుకు వాహనాలకు ఇదే ప్రధానమైన రహదారి. ఒడిశాతో పాటు గ్రోత్ సెంటర్‌లో కొత్త పరిశ్రమలు పెరుగుతుండడంతో వాటికి ముడిసరుకును సకాలంలో అందించేందుకు భారీ లారీల రాకపోకలకు ఈ బ్రిడ్జి ప్రధానమైన అనుసంధాన కర్తగా నిలుస్తోంది. బ్రిటిష్ కాలం నాటి ఈబ్రిడ్జి మరమ్మతుల బారిన పడి కుంగిపోయింది. దీంతో కొత్త బ్రిడ్జి నిర్మాణానికి ఎన్నో ప్రభుత్వాలకు ప్రజాప్రతినిధులు ప్రతిపాదించినా ఫలితం లేకుండా పోయింది.

9 స్తంభాలతో బ్రిడ్జి నిర్మాణం

కాగా బ్రిడ్జి నిర్మాణానికి భూమి లోపల 52 పిల్లర్లను నిర్మించారు. దాదాపు వాటి పని పూర్తయింది. వాటిపై 9 స్తంభాలను నిర్మించి 168 మీటర్ల పొడవుతో బ్రిడ్జి నిర్మాణం పూర్తికానుంది. అయితే ఇంత వరకూ బాగున్నా సొంత నిధులతో నిర్మాణం చేపడుతున్న బీవీఎస్ఆర్ ఏజెన్సీ ఇప్పటివరకు దాదాపు రూ.4.5 కోట్లను ఖర్చు చేసింది. చేసిన పనులకు సంబంధించి రూ.1.5 కోట్ల బిల్లులను ప్రభుత్వానికి పంపి నిధుల మంజూరు కోసం ఎదురు చూస్తోంది. దాదాపు 5 నెలలుగా ప్రభుత్వం పైసా విదల్చక పోవడంతో బ్రిడ్జి పనులపై నీలినీడలు అలుముకున్నాయి. బ్రిడ్జి పనులకు నిధులు మంజూరైనా పనులు చేపడుతున్న కాంట్రాక్టర్‌కు విడుదల చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. పర్సంటేజీల అంశం తెరపైకి వస్తోంది. ఎవరో కావాలనే నిధుల విడుదలకు మోకాలడ్డుతున్నారని, తమ వాటా దక్కనిదే నిధుల విడుదల జరగదని కాంట్రాక్టర్‌ను హెచ్చరించినట్లు చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో చకచకా జరుగుతున్న పనులు ఎప్పుడు ఆగిపోతాయోనన్న అనుమానాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

జాతీయరహదారిలో ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

• ఎస్పీ వకుల్‌జిందాల్



పోలీస్‌స్టేషన్ క్వార్టర్స్ స్థలం గేటును ప్రారంభిస్తున్న ఎస్పీ వకుల్‌జిందల్

పూసపాటిరేగ: జాతీయరహదారిలో ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ వకుల్‌జిందాల్ తెలియజేశారు. ఈ మేరకు బుధవారం ఆయన నాతవలస జంక్షన్ నుంచి కందివలస వరకు జాతీయరహదారిపై ప్రమాదాలు జరిగే 32 బ్లాక్‌స్పాట్‌లను గుర్తించారు. పూసపాటిరేగ పోలీస్‌స్టేషన్ ప్రహరీ గేటును లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలలో స్టాపర్స్, సిగ్నల్స్, జీబ్రా మార్కులు ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారిస్తామన్నారు. ఎన్‌హెచ్ 26లో ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంవల్ల 30 శాతం వరకు ప్రమాదాలు తగ్గాయని చెప్పారు. జాతీయరహదారి సర్వీసురోడ్డులో ప్రమాదాలు జరిగిన చోట రెయిలింగ్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎస్పీతో పాటు డీఎస్పీ ఎం.శ్రీనివాసురావు, భోగాపురం రూరల్ సీఐ డి.రామకృష్ణ, ఎస్సైలు ఐ.దుర్గాప్రసాద్, ఎ.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు పయనం



జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు పయనమైన తోయక పరమేష్

గుమ్మలక్ష్మీపురం: బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో గల పాటలీపుత్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈనెల 10 నుంచి జరిగే జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు గుమ్మలక్ష్మీపురం మండలంలోని కొత్తగూడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న తోయక పరమేష్ బుధవారం పయనమయ్యాడు. ఈ మేరకు పరమేష్ 68వ ఫెన్సింగ్ ఎస్‌జీఎఫ్ఐ గేమ్స్‌లో అండర్ 19 బాయ్స్ అండ్ గరల్స్ ఈపీఈఈ విభాగంలో గత ఏడాది నవంబర్ 26 నుంచి 28వ తేదీ వరకు నంద్యాలలోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియం వద్ద జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో వ్యక్తిగత విభాగంలో ప్రతిభ చూపి కాంస్య పతకం సాధించి, జాతీయ పోటీలకు ఎంపికయ్యాడని పాఠశాల పీడీ నిమ్మక మాధవరావు తెలిపారు. జాతీయస్థాయి పోటీల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనపర్చాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, డిప్యూటీ వార్డెన్ ఆర్.రమేష్‌లు ఆకాంక్షించారు.

ప్రతిభకు ప్రశంసలు



ఏఆర్ కానిస్టేబుల్ అరుణ్ కుమార్‌ను అభినందిస్తున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి

పార్వతీపురంటౌన్: కాకినాడ జేఎన్‌టీయూ ఇండోర్ స్టేడియంలో ఎన్‌టీఆర్ స్మారక ఏపీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓపెన్ స్టేట్ మీట్ తైక్వాండో పోటీల్లో బంగారు పతకాన్ని సాధించిన ఏఆర్ కానిస్టేబుల్ కె.అరుణ్ కుమార్‌ను ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి అభినందించారు. ఓపెన్ స్టేట్ మీట్ తైక్వాండో పోటీల్లో సీనియర్ పురుషుల 80 కేజీల విభాగంలో ఈ సందర్భంగా ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి పోలీస్ కార్యాలయంలో బుధవారం అరుణ్‌కుమార్‌ను సత్కరించారు. ముున్ముందు జరగబోయే క్రీడల్లో పాల్గొని విజయం సాధించి రాష్ట్ర, జిల్లా పోలీస్ ఖ్యాతిని పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఏఆర్ ఆర్ఐలు నాయుడు, రాంబాబు పాల్గొన్నారు.

జిల్లాలో మత్స్యసంపద వృద్ధి చెందాలి



నర్సిపురంలో చేపపిల్లలను విడుదల చేస్తున్న జిల్లా మత్స్యశాఖ అధికారి వేముల తిరుపతయ్య

పార్వతీపురంటౌన్: జిల్లాలో మత్స్యసంపద వృద్ధి చెందాలని పార్వతీపురం మన్యం జిల్లా మత్స్యశాఖ అధికారి వేముల. తిరుపతయ్య అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ పరిధిలో పార్వతీపురం మండలం నర్సిపురం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నేతృత్వంలో 11 చెరువుల్లో 2,74,710 చేప పిల్లలను, పీఎంఎంఎస్‌వైలో భాగంగా 16 చెరువుల్లో 1,27,200 చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్స్యసంపద అభివృద్ధి పెరిగితే మత్స్యకారుల సంపద పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం మత్స్యకారుల కోసం అనేక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అభివృద్ధి అధికారి యెల్లేటి. శ్రీదేవి, ఇరిగేషన్ ఏఈ (ఐటీడీఏ) జి.గౌరి నాయుడు, ఏపీఎం బి.సన్నిబాబు, మత్స్యకార సంఘం అధ్యక్షుడు మురుముళ్ల.శ్రీనివాస్, సింగిడి.గున్నారావు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కొద్ది నెలల్లో మూడో లైన్ పూర్తి

• డీఆర్ఎం మనోజ్‌కుమార్‌సాహు



రైల్వేస్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు

బొబ్బిలి: మరి కొద్ది నెలల్లో రాయపూర్–విశాఖ మూడో లైన్ నిర్మాణం పూర్తవుతుందని డీఆర్ఎం మనోజ్ కుమార్ సాహు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన బొబ్బిలి పట్టణంలో నిర్మాణంలో ఉన్న ఆదర్శ రైల్వే స్టేషన్ నూతన భవనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ సాలూరు–బొబ్బిలి ట్రెన్ ట్రిప్ త్వరలో ప్రారంభం అవుతుందని చెప్పారు. ఇప్పటికే ట్రయల్ రన్ పూర్తయిందని, కొన్ని సాంకేతిక సమస్యలున్నాయని, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో దివ్యాంగులకు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేసిన ప్రాంతంలో వారికి వీలుగా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాంలపై నిర్మాణ సామగ్రి ఉండడం వల్ల ప్రయాణికులకు ఇబ్బందులు కలుగుతాయని వాటిని తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈనెల 15న రైల్వే జీఎం స్టేషన్‌ను సందర్శిస్తారని చెప్పారు. మూడో లైన్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌ను కోరారు. ఆయన వెంట స్థానిక రైల్వే సిబ్బంది ఉన్నారు.

గడ్డిమందు తాగి విద్యార్థికి అస్వస్థత



విజయనగరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి రాకేష్

తెర్లాం: తోటి విద్యార్థుల ట్యాబ్‌లు తన బ్యాగ్‌లో ఉండడాన్ని చూసిన హాస్టల్ విద్యార్థులు వార్డెన్‌కు, పాఠశాల ఉపాధ్యాయులకు చెబుతారనే భయంతో మనస్తాపానికి గురైన తెర్లాం బీసీ హాస్టల్‌కు చెందిన విద్యార్థి రాకేష్ గడ్డిమందు తాగి అస్వస్థతకు గురయ్యాడు. మంగళవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి హాస్టల్ సిబ్బంది, బాధిత విద్యార్థి బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బలిజిపేట మండలం చిలకలపల్లి గ్రామానికి చెందిన ఎన్.రాకేష్ ఈ ఏడాదే తెర్లాం బీసీ హాస్టల్‌లో చేరాడు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ఈ నెల ఒకటో తేదీన పాఠశాలకు వచ్చిన రాకేష్ పాఠశాల ముగిసిన వెంటనే తిరిగి హాస్టల్‌కు వెళ్లిపోయాడు. అయితే రాకేష్ బ్యాగ్‌లో వేరే విద్యార్థుల ట్యాబ్‌లు ఉండడాన్ని హాస్టల్‌లోని కొంతమంది విద్యార్థులు చూశారు. తన దగ్గర ట్యాబ్‌లు ఉన్నాయన్న విషయం వార్డెన్‌కు, పాఠశాల ఉపాధ్యాయులకు వారు చెబుతారని భయపడ్డాడు. తన బ్యాగ్‌లో ట్యాబ్‌లు ఉన్న విషయం వార్డెన్‌కు, ఉపాధ్యాయులకు తెలిస్తే ఏమవుతుందోనని భయపడి పురుగు మందులు విక్రయించే దుకాణానికి వెళ్లి గడ్డి మందు కొనుగోలు చేసి హాస్టల్‌కు తెచ్చి స్నానాల గదిలోకి వెళ్లి తాగేశాడు. గడ్డి మందు తాగిన కొంతసేపటికి వాంతులు చేసుకోవడంతో మిగిలిన విద్యార్థులు చూసి హాస్టల్ సిబ్బందికి తెలియజేశారు. దీంతో వెంటనే హాస్టల్ సిబ్బంది రాకేష్‌ను తెర్లాంలోని పీహెచ్‌సీకి తీసుకువెళ్లగా అక్కడి వైద్యసిబ్బంది ప్రథమచికిత్స చేసి మెరుగైన వైద్యసేవల నిమిత్తం విజయనగరంలోని సర్వజన ఆస్పత్రికి రిఫర్ చేశారు. ప్రస్తుతం రాకేష్ సర్వజన ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్నాడు. విద్యార్థి ఆరోగ్యం బాగానే ఉందని హాస్టల్ సిబ్బంది తెలిపారు.

గంజాయి పీలుస్తున్న యువత పట్టివేత



గంజాయి పీలుస్తూ పట్టుబడిన వారితో ఎస్సై సన్యాసి నాయుడు, సిబ్బంది తదితరులు, చిత్రంలో సీజ్ చేసిన మోటార్‌సైకిల్స్, గంజాయి, సెల్‌ఫోన్లు

డెంకాడ: మండలంలోని బేతనాపల్లి గ్రామ శివారు ప్రాంతంలో గంజాయి పీలుస్తున్న పలువురు నిందితులను డెంకాడ ఎస్సై ఎ.సన్యాసినాయుడు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పట్టుకున్నారు. విజయనగరం పట్టణానికి చెందిన క్షత్రియ జశ్వంత్, యాట్ట గోపితో పాటు మరో ముగ్గురు మైనర్లు బుధవారం గంజాయి పీలుస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై సన్యాసినాయుడు తెలిపారు. నిందితుల నుంచి 160 గ్రాముల గంజాయి, 5 మొబైల్‌ఫోన్లు, రెండు మోటారు సైకిళ్లు పట్టుకుని సీజ్ చేసినట్లు చెప్పారు.

వైభవంగా తోటపల్లి ఆలయ పునఃప్రతిష్ట

• భక్తులను ఆకర్షించేలా నిర్మాణాలు
• ప్రతిష్ట పూజల్లో పాల్గొన్న భక్తులు



ఆలయ పునఃప్రతిష్ట పూజల్లో పాల్గొన్న భక్తులు



స్వామివారిని దర్శించుకున్న జెడ్పీ వైస్‌చైర్మన్ బాపూజీనాయుడు



విద్యుత్ కాంతులతో తోటపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం

గరుగుబిల్లి: తోటపల్లిలో స్వయంభూగా వెలసిన శ్రీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి నూతన ధ్వజ, యంత్ర, శిఖర, గరుడ పరివార దేవతా సహితంగా ఆలయ పునఃప్రతిష్ట కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పాంచరాత్ర ఆగమ విధానంలో బ్రహ్మశ్రీ కొడవటిగంటి వేంకట నరసింహాచార్యుల పర్యవేక్షణలో, టీటీడీ వేదపండితుల సహకారంతో ఆలయాన్ని ప్రారంభించారు. ఈ మేరకు ఉదయం విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, ప్రాయశ్చిత్తం, ఋత్విగ్వరుణ, దీక్షావస్త్ర, కంకణధారణ, మత్స్యంగ్రహణం తదితర పూజాకార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా నూతనంగా నిర్మించిన ఆలయాన్ని భక్తులను ఆకర్షించేలా సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. అలాగే పునఃప్రతిష్టకు ఆలయాన్ని విద్యుత్ కాంతులతో అలంకరించారు. ఆలయ పునఃప్రతిష్టలో భాగంగా జరుగుతున్న పూజల్లో ఉమ్మడి జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే కార్యక్రమంలో భాగంగా సాయంత్రం కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బెలగాం భీమేశ్వరరావు సంకలనం చేసిన 'తోటపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి మహత్యం' పుస్తకాన్ని ఆవిష్కరించారు.

'ఆలయ చరిత్ర

పార్వతీపురం–శ్రీకాకుళం ప్రధాన రహదారి పరిధిలోని తోటపల్లివద్ద 1969లో జరిగిన రోడ్డుప్రమాదంలో ఓ ప్రైవేట్ బస్సు లోయలో పడింది. ఆ బస్సును వెలికితీసే ప్రయత్నంలో పొదలు, డొంకలు, చెట్లు తొలగిస్తున్న సమయంలో రెండున్నర అడుగుల శ్రీ చెన్నకేశవ స్వామి శిలా విగ్రహం బయటపడింది. ఈమేరకు స్థానికులు తాత్కాలికంగా కొమ్మలతో పందిరిని ఏర్పాటుచేసి స్వామివారి విగ్రహాన్ని ఉంచి పూజలు చేశారు. అప్పటి పార్లమెంటు సభ్యుడు విశ్వాసరాయ నరసింహారావు 'మేలుకొలుపు''అనే కరపత్రాన్ని ప్రచురించి వీరఘట్టంకు చెందిన డాక్టర్ నల్లాన సాంబశివరావు అధ్యక్ష తన 40మంది సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఆలయనిర్మాణానికి తోటపల్లి గ్రామానికి చెందిన మార్కొండ కుటుంబీకులు స్థలాన్ని ఉచితంగా ఇచ్చారు. ఆలయనిర్మాణానికి పలువురు దాతలు ముందుకువచ్చి విరాళాలు ఇవ్వడంతో ఆగమ శాస్త్రం ప్రకారం తోటపల్లిలోని నాగావళినది ఒడ్డున శ్రీవేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్ల ఆలయాలను నిర్మించారు. రోడ్డు ప్రమాదంలో లభించిన శ్రీచెన్నకేశవస్వామి విగ్రహానికి పలుచోట్ల గాట్లు ఏర్పడడంతో ఆ విగ్రహమే నేడు పుట్టుదేవునిగా భక్తులనుంచి పూజలు అందుకుంటోంది. విజయవాడలోని శిల్పశాలనుంచి పద్మావతి, వేంకటేశ్వరస్వామి విగ్రహాలను తెప్పించి 1972లో ప్రతిష్ట కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

'ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ఆలయంలో పలు నిర్మాణాలు శిథిలావస్థకు చేరుకోవడంతో సీజీఎస్ నిధులకోసం అప్పటి ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి సిఫార్సు చేశారు. ఈ మేరకు ఆలయ అభివృద్ధికోసం రూ. 83లక్షల సీజీఎస్ నిధులు విడుదలచేశారు. ఈ నేపథ్యంలో ఆలయంలో పలు నిర్మాణాలకు 2020 జూన్10న పుష్పశ్రీవాణి భూమి పూజ చేశారు. ఆలయ పనులు నత్తనడకన సాగడంతో రెండేళ్ల క్రితం తోటపల్లి ఆలయ అభివృద్ధి కమిటీని స్థానికులు ఏర్పాటుచేసి దాతల నుంచి విరాళాలను సేకరించి ఆలయం పనులు వేగవంతం చేశారు.

ఫిబ్రవరి 8న స్వామివారి కల్యాణం

తోటపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మాఘ శుద్ధ ఏకాదశి సందర్భంగా ఫిబ్రవరి 8న శనివారం సాయంత్రం 6గంటలనుంచి శ్రీ వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్ల సామూహిక ఉచిత కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నారు. ఈమేరకు కల్యాణానికి సంబంధించిన ఏర్పాట్లు దాదాపు పూర్తిచేశారు. భక్తులు, దాతల సహకారాలతో నిర్వహించే ఈ కల్యానంలో భక్తులు అధికంగా పాల్గొనాలని ఈఓ సూర్యనారాయణ కోరారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

• ఇన్‌చార్జ్ సీడీపీఓ ప్రసన్న

విజయనగరం ఫోర్ట్: బాలలు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని ఇన్‌చార్జ్ సీడీపీఓ జి.ప్రసన్న అన్నారు. బుధవారం స్థానిక కేంద్రియ విద్యాలయంలో బేటీ బచావో – బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, ఆట పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ పి.విజయలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి. ఎర్రయ్యమ్మ, సోషల్ కౌన్సిలర్ రమాదేవి, కేంద్రియ విద్యాలయం ప్రిన్సిపాల్ దిలీప్ మోదీ, తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన అభివృద్ధి పనులు

విజయనగరం రూరల్: మండలంలోని ద్వారపూడిలో ఉపాధిహామీ నిధులు రూ.14 లక్షలతో చేపడుతున్న సీసీ డ్రెయిన్లు, కాలువల అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. రాజావీధి, పెద్దకాపు వీధి ప్రాంతాల్లో అభివృద్ధి పేరుతో ఇళ్ల ముందుభాగం తొలగించి నెల రోజులవుతన్నా ఇప్పటికీ కాలవల నిర్మాణం చేపట్టకపోయే సరికి స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక వైపు రోడ్డుపైనే మురుగు పేరుకుపోవడం, మరో వైపు ఇంటి ముందు శిథిలాలు ఉండడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువల నిర్మాణం త్వరితగతిన చేపట్టాలని కోరుతున్నారు.

వక్ఫ్ స్థలాల పరిరక్షణకు చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: జిల్లాలోని వక్ఫ్ స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి వక్ఫ్ పరిరక్షణ కమిటీ సమావేశం కలెక్టర్ చాంబర్‌లో బుధవారం నిర్వహించారు. వక్ఫ్ స్థలాల పరిరక్షణకు తీసుకో వాల్సిన చర్యలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంబేడ్కర్ మాట్లాడుతూ వక్ఫ్ స్థలాలు అన్యాక్రాంతం అవకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందనని స్పష్టం చేశారు. జిల్లాలో మొత్తం 99 వక్ఫ్ స్థలాలను గుర్తించామని వాటిలో 32 స్థలాలను ఇప్పటికే నోటిపై చేసినట్లు చెప్పారు. మొత్తం అన్ని స్థలాల వివరాలను రెండు రోజుల్లో సంబంధిత ఆర్‌డీఓలు, మున్సిపల్ కమిషనర్లకు అందజేయాలని వక్ఫ్, మైనారిటీ శాఖాధికారులకు సూచించారు. వివరాలు ఇచ్చిన పది రోజుల్లోగా స్థలాలన్నిటినీ సర్వే చేసి, సరిహద్దులు నిర్ణయించాలని ఆర్‌డీఓలు, మున్సిపల్ కమిషనర్లను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీఆర్ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, ఏఎస్పీ సౌమ్యలత, డీపీఓ టి.వెంకటేశ్వర్రావు, ఎస్‌డీసీ జోసెఫ్, జిల్లా రిజిస్ట్రార్ కుమారి, సర్వే శాఖ ఎ.డి రమణమూర్తి, ఆర్‌డీఓ డి.కీర్తి, మున్సిపల్ కమిషనర్లు పి.నల్లనయ్య, జె.రామప్పలనాయుడు, రామలక్ష్మి, అప్పలరాజు, జిల్లా మైనారిటీ అధికారి ఆర్ఎస్‌జాన్, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ అబ్దుల్ షాహీ షేక్ తదితరులు పాల్గొన్నారు.